మతోన్మాదుల కట్టుకథ 'కేరళ స్టోరీ'

- పంచాయతీ జూనియర్ కార్యదర్శుల తొలగింపు హెచ్చరిక సరికాదు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- రెజ్లర్లకు మద్దతుగా నిరసన ర్యాలీ
- బ్రిజ్ భూషణ్ అరెస్టుకు డిమాండ్.. దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లైంగిక వేధింపుల అవమానానికి గురైన మహిళా రెజ్లర్ల నిరసనను కేంద్రం పెడచెవిన పెడుతోందని, బిజెపికి మనుధర్మం అమలుపై ఉన్న భక్తి మహిళలపై లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. బిజెపి ఎంపి, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని కోరుతూ మల్లయోధులు నెలరోజులుగా ఆందోళనలు, నిరాహార దీక్షలు చేస్తున్నా నరేంద్ర మోడీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మహిళల పట్ల చిన్నచూపునకు ఈ ఘటన నిదర్శనం అని వ్యాఖ్యానించారు. మహిళా రెజ్లర్లకు మద్దతుగా సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. పార్టీ కార్యాలయం నుంచి సరిత క్లీనిక్ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించి, అక్కడ బ్రిజ్‌భూషణ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం తమ్మినేని మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలపై బురదజల్లేందుకు 'కేరళ స్టోరీ' అనే ఓ సినిమాను బయటకు వదిలారని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఇలాంటి స్టోరీలు చాలా తీస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చెప్పడాన్ని తప్పుబట్టారు. 'కేరళ స్టోరీ' సినిమాలో వాస్తవాలను దాచిపెట్టారని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో కూడా మతోన్మాదాన్ని బహిరంగంగా ముందుకు తీసుకెళ్తూ మోడీ ప్రచారం నిర్వహిస్తున్న తీరును ఆక్షేపించారు. దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వ విధానాలపై సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. అప్రజాస్వామిక చర్యలను సిపిఎం ఖండిస్తోందన్నారు.

విధుల్లో చేరకపోతే తొలగిస్తామనడం దుర్మార్గం

రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ సెక్రటరీలు శనివారం మధ్యాహ్నంలోగా విధుల్లో చేరకపోతే ఉద్యోగాలు ఊడినట్టేనని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించడం చాలా దుర్మార్గమైన చర్యని విమర్శించారు. జెపిఎస్‌ల రెగ్యులరైజేషన్ కోసం తాను స్వయంగా సిఎంకు లేఖ రాశానన్నారు. జూనియర్ పంచాయతీ సెక్రటరీలను వెంటనే చర్చలకు పిలిచి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా' అంటూ మనుస్మృతిలో చెప్పటం కాదు.. ఆచరణలోనూ మహిళలను గౌరవించాలి.. వారిని దేవతల్లా పూజించాలని బిజెపి శ్రేణులకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి పద్మ, మాచర్ల భారతి, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోడీకి బుద్ధి చెప్పిన కన్నడీగులు

కేంద్రంలో మోడీ ప్రభుత్వ దుర్మార్గపూరిత చర్యలకు కర్ణాటక ప్రజలు తగిన బుద్ధి చెప్పారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఆ రాష్ట్రంలో ప్రభుత్వ నిధులు 40 శాతం పక్కదోవ పట్టడంతో ప్రజలు బిజెపికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.

దక్షిణాది బిజెపి పతనం మొదలైంది

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణాది నుంచి బిజెపి పతనం ప్రారంభమైందని, అన్ని చోట్లా ఆ పార్టీ ఖాతా ముగుస్తుందని తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణలో బిజెపికి కనీసం డిపాజిట్లు కూడా దక్కవని వ్యాఖ్యానించారు. కర్ణాటక తీర్పుతో బిజెపి నుంచి దక్షిణ భారతదేశానికి విముక్తి లభించిందన్న హరీశ్‌రావు.. ఈ చరిత్ర కొనసాగుతుందని ట్వీట్ చేశారు. కర్ణాటకలో ఏర్పాటు కానున్న కొత్త ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

కర్ణాటక ఫలితాలు ఇక్కడ పనిచేయవు

- కెటిఆర్ ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక ఫలితాలు తెలంగాణపై ఎలాంటి ప్రభావం చూపబోవని మంత్రి కెటిఆర్ అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయం నేపథ్యంలో ఆయన ఈ మేరకు ట్వీట్ చేశారు. విభజనవాద రాజకీయాలను తిరస్కరించిన కర్ణాటక వాసులకు ధన్యవాదాలు చెప్పారు. హైదరాబాద్, బెంగళూరుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నెలకొనాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

బిజెపిని చావు దెబ్బ కొట్టారు

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీయాలని చూసిన బిజెపిని కర్ణాటక ప్రజలు చావుదెబ్బ కొట్టారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎద్దేవా చేశారు. ఇడి, సిబిఐ, ఐటీలతో కాంగ్రెస్ నేతలపై కేంద్రం దాడులు చేయించిందని గుర్తుచేశారు. అక్కడ ఊరురా మఠాలు ఉన్నాయని, బీజేపీకి మఠాలపై ప్రేమలేదనే విషయాన్ని ప్రజలు గమనించారని తెలిపారు. దక్షిణ భారత దేశాన్ని, ఆ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను అవమానించిన ఆ పార్టీకి భంగపాటు తప్పలేదని చురకలంటించారు.

ప్రజల తీర్పును ఆహ్వానిస్తున్నాం : ప్రజాపంథా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో మత విద్వేష, ఫాసిస్టు బిజెపిని ఓడించిన ప్రజల తీర్పును ఆహ్వానిస్తున్నామని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిరాయింపులకు అవకాశం ఇచ్చే వాతావరణం లేకుండా కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజార్టీతో బిజెపిని మట్టికరిపించడం ఓటర్ల విజ్ఞతకు నిదర్శనమని తెలిపారు. బిజెపి కర్ణాటకలో ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టిందని తెలిపారు. గౌరీలంకేశ్, కల్బుర్గి వంటి మేధావులు, జర్నలిస్టులను చంపిందని విమర్శించారు. మోడీ, అమిత్‌షా దుష్ట రాజకీయాలకు ఫాసిస్టు విధానాలను వ్యతిరేకించారని పేర్కొన్నారు. ఈ తీర్పు ప్రజాస్వామికమైందని తెలిపారు. విద్వేషాలతో రగులుతున్న దేశానికి ఇది ఊరట అని వివరించారు. ఇది దేశ భవిష్యత్ తీర్పుగా మారాలని ఆకాంక్షించారు.

కర్ణాటక ప్రజలకు జేజేలు

- పిడిఎస్‌యు, పివైఎల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతోన్మాద బిజెపిని ఓడించిన కర్ణాటక ప్రజలకు పిడిఎస్‌యు, పివైఎల్ రాష్ట్ర కమిటీలు జేజేలు ప్రకటించాయి. ఈ మేరకు పిడిఎస్‌యు, పివైఎల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి మహేష్, డి సాయిరెడ్డి, ఎస్‌వి శ్రీకాంత్, ఇ సాగర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మతోన్మాద, ఫాసిస్టు, కార్పొరేట్ విధానాలను అవలంభిస్తూ దేశ సంపదను కొల్లగొడుతూ అంబానీ, అదానీలకు కొమ్ముకాస్తున్న బిజెపిని ఓడించడం దేశానికి మంచి పరిణామమని తెలిపారు. బిజెపి కార్పొరేట్ అనుకూల విధానాలకు ఈ ఫలితాలు చెంపపెట్టు అని విమర్శించారు. మతోన్మాద, ఫాసిస్టు బిజెపిని ఓడించాలంటూ పలు నియోజకవర్గాల్లో ప్రచారం చేశామని తెలిపారు. దేశంలో ప్రజాస్వామిక, లౌకిక విలువల కోసం పోరాడుదామని కోరారు.

జెపిఎస్, విఒఎల సమస్యలను పరిష్కరించాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జెపిఎస్), విఒఎల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ జనార్ధన్ డిమాండ్ చేశారు. సమ్మెలు, దీక్షల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడాన్ని శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

విఒఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.27 వేలు నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ఆన్‌లైన్ సేవలను నిలిపేయాలని సూచించారు. సిసిలుగా ప్రమోట్ చేయాలని తెలిపారు. వారికి గుర్తింపు కార్డులు, బీమా సౌకర్యం, పిఎఫ్, ఇఎస్ఐ కల్పించాలని పేర్కొన్నారు. జెపిఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించాలని తెలిపారు. మహిళా కార్యదర్శులకు ఆర్నెళ్లపాటు మెటర్నిటీ సెలవులు పొడిగించాలని పేర్కొన్నారు. ప్రొవిజినల్ పీరియడ్‌లో చేసిన పనిని సర్వీస్‌గా పరిగణించాలని కోరారు. విఒఎ, జెపిఎస్‌ల సమస్యలను పరిష్కరించి సమ్మెలను విరమింపచేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వద్దు

- టెలీకాన్ఫరెన్స్‌లో ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాల విషయంలో అధికారులు అలసత్వం వహించరాదని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిన సమయంలో అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులకు ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో అండగా నిలుద్దామని దిశానిర్దేశం చేశారు. యాసంగి ధాన్యం కొనుగోళ్ల అంశంపై జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు మొత్తం 2300 మందితో కలిసి శనివారం మంత్రి హరీశ్‌రావు అమెరికా నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సతీశ్, ముత్తిరెడ్డి యాదిరెడ్డి, జడ్‌పి చైర్మన్ రోజాశర్మ, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీలు, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అడిషనల్ కలెక్టర్ ముజమ్మీల్ ఖాన్, శ్రీనివాస్ రెడ్డి, రైతుబంధు సమితి ప్రజాప్రతినిధులతో సమీక్షించారు.జిల్లా వ్యాప్తంగా 415 కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభించినట్టు, ఇప్పటిదాకా 7304 మంది రైతుల నుంచి రూ.67 కోట్ల విలువైన 32508 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. ట్యాబ్ ఎంట్రీలో జాప్యం జరుగుతుందని, పిఎసిఎస్, ఐకెపి, సిబ్బంది నిర్వహణలో రూ.67 కోట్ల ధాన్యం కొనుగోలు చేస్తే రూ.45 కోట్లు మాత్రమే ట్యాబ్ ఎంట్రీ జరిగిందని, ఏ రోజుకారోజు ట్యాబ్ ఎంట్రీ జరగాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ట్రక్ షీట్ జనరేట్ చేయడంలో మిల్లర్లు సహకరించాలని, ట్రక్‌షీట్ జనరేట్ రూ.32 కోట్లు, మిల్లర్లు అకనాలెడ్జ్‌మెంట్ రూ.29 కోట్లు, డబ్బు చెల్లింపులు రూ.17 కోట్లకు ఇవ్వడంతో ఎంతో గ్యాప్ ఉన్నదన్నారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే వరకూ మిల్లర్లు రైతులకు సహకారం అందించాలని కోరారు. గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ కవర్లు ధాన్యం కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని మంత్రి అధికారులకు సూచించారు. ఇటీవల వడగళ్ళ వర్షం వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తుందని భరోసా కల్పించారు.

నేటితో ఎంసెట్ ఇంజినీరింగ్ పరీక్షలు పూర్తి

- రెండోరోజు 95.21 శాతం హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు ఆదివారంతో ముగియనున్నాయి. ఈ మేరకు ఎంసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగానికి రెండోరోజు ఉదయం నిర్వహించిన మొదటి విడతకు 34,655 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 32,996 (95.21 శాతం) మంది పరీక్ష రాశారు. 1,659 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో విడతకు 34,370 మంది దరఖాస్తు చేయగా, 32,722 (95.21 శాతం) మంది హాజరయ్యారు. 1,649 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు జరుగుతున్న తీరును ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, జెఎన్‌టియు హైదరాబాద్ విసి కట్టా నర్సింహారెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

14న అగ్రికల్చర్ విభాగం ప్రాథమిక కీ విడుదల

ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రాతపరీక్షలను ఈనెల 10,11 తేదీల్లో నిర్వహించామని ఎంసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రాథమిక కీతోపాటు అభ్యర్థుల రెస్పాన్స్ షీట్‌ను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని సూచించారు. ప్రాథమిక కీపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 16వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు సమర్పించొచ్చని కోరారు. ఎంసెట్ వెబ్‌సైట్ ద్వారానే అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఇతర పద్ధతుల్లో స్వీకరించబోమని స్పష్టం చేశారు.

దేశానికి తెలంగాణ మోడల్ కావాలి

- ఐడియాస్ ఫర్ ఇండియా సదస్సులో మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో ఐదు విప్లవాలను సాధించడంతోనే అనతికాలంలో తెలంగాణ ప్రగతి సాధ్యమైందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. తెలంగాణ మోడల్‌ను అనుసరిస్తే ఇండియాకు తిరుగుండబోదని ఆయన పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇంగ్లాండ్‌లో పర్యటిస్తున్న మంత్రి కెటిఆర్, లండన్‌లో శనివారం నిర్వహించిన 'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సులో పాల్గొని తొమ్మిదేండ్ల తెలంగాణ విజయగాథను ఉద్వేగభరితంగా వివరించారు. ఉపాధి కల్పన, ఔత్సాహిక పారిశ్రామిక రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతను తయారుచేసినప్పుడే దేశాభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందని అన్నారు. "భారతదేశానికి అనేక సహజ అనుకూలతలు ఉన్నాయి. దేశంలో సమృద్ధిగా సహజ వనరులు, ఖనిజాలతో పాటు తగినంత కరెంటును ఉత్పత్తి చేయడానికి అవసరమైన వనరులు ఉన్నాయి. నదులు, సరస్సులు, నీటి వనరులతో వ్యవసాయ భూములకు కావాల్సినంత సాగునీరు, ప్రజలందరికి తాగునీరు, పారిశ్రామిక రంగానికి అవసరమైన నీటిని సరఫరా చేయయొచ్చు. మానవ జాతి చరిత్రలో ఇప్పటివరకు ఏ దేశానికి లభించని గొప్ప అవకాశం భారతదేశానికి మాత్రమే దొరికింది. జనాభాలో అత్యధికంగా ఉన్న యువత శక్తి సామర్థ్యాలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకునే విధంగా సరైన ప్రణాళికలు, సమర్థవంతమైన కార్యాచరణను అమలు చేస్తే 30 ఏండ్లల్లో చైనా సాధించిన ప్రగతిని 20 ఏండ్లలోపే ఇండియా సాధించొచ్చు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను సృష్టించేలా యువతకు శిక్షణ ఇవ్వాలి. తొమ్మిదేండ్లల్లోనే విప్లవాత్మక ప్రగతితో తెలంగాణ అగ్రగామి రాష్ట్రంగా మారింది. వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించడంతోనే ఆయా రంగాల్లో విప్లవాత్మక మార్పును సాధించింది' అని కెటిఆర్ తెలిపారు.

హైదరాబాద్‌లో డిఎజెడ్ఎన్ స్పోర్ట్స్ లైవ్ స్ట్రీమింగ్

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా కొనసాగుతున్న మంత్రి కెటిఆర్ ఇంగ్లాండ్ పర్యటన విజయవంతంగా కొనసాగుతున్నది. స్పోర్ట్స్ లైవ్ స్ట్రీమింగ్‌లో దిగ్గజ సంస్థ అయిన డిఎజెడ్ఎన్ హైదరాబాద్‌లో తమ ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. లండన్‌లో ఉన్న కెటిఆర్‌ను డిఎజెడ్ఎన్ గ్రూప్ ఉన్నతాధికారులైన సందీప్ టికు, డైసీవెల్స్‌లు కలిసిన తర్వాత కంపెనీ ఈ ప్రకటన చేసింది. 200కుపైగా దేశాల్లో 60 మిలియన్ల సబ్ స్క్రైబర్లు ఉన్న అంతర్జాతీయ ఓవర్-ది-టాప్ స్పోర్ట్స్ స్ట్రీమింగ్ సర్వీస్ (ఓటిటీ డీఏజెడ్ఎన్). ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రీడాభిమానులు అత్యధికంగా చూసే యూఈఎఫ్ఏ ఛాంపియన్స్ లీగ్, యూరోపా లీగ్, సీరీ ఏ, లా లీగా, ఇంగ్లీషు ప్రీమియర్ లీగ్, ఎన్ఎఫ్ఎల్, ఎన్‌బిఎ, ఇతర దేశాల్లోని ఐపిఎల్ వంటి ప్రధాన ఈవెంట్‌ల లైవ్, ఆన్-డిమాండ్ స్పోర్ట్స్ కంటెంట్‌ను డిఏజెడ్ఎన్ ప్రసారం చేస్తుంది. ఈ పెట్టుబడితో తెలంగాణ యువతకు వెయ్యి మందికి ఉద్యోగాలు వస్తాయని కంపెనీ తెలిపింది.

భానుడి భగభగ

- తీవ్రమైన ఉక్కపోత
- వీణవంకలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భానుడు భగభగ మండిపోతున్నాడు. ఎండతో హడలెత్తిస్తున్నాడు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తన ప్రతాపాన్ని తీవ్రస్థాయిలో చూపుతున్నాడు. ఇంట్లో నుంచి కాలు బయటపెడితే మాడ పగలగొట్టేస్తున్నాడు. లీటర్ల కొద్దీ నీళ్లు తాగినా దాహం తీరట్లేదు. మరోవైపు ఉక్కపోత తీవ్రతరం అయ్యింది. ప్రజలు ఎండవేడిమి తాళలేక హడలిపోతున్నారు. శనివారం కరీంనగర్ జిల్లా వీణవంకలో 45.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇదే అత్యధికం. రాబోయే మూడు నాలుగు రోజులపాటు ఎండలు దంచికొట్టే అవకాశముంది. ఉష్ణోగ్రతలు కూడా ఇప్పుడున్నదానికంటే రెండు నుంచి నాలుగు డిగ్రీల మేర పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాబోయే మూడునాలుగు రోజులు రాష్ట్రంలో పొడివాతావరణం ఉంటుంది. ఆదివారం కూడా కరీంనగర్, పెద్దపల్లి, ఆదిలాబాద్, జగిత్యాల, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, నిర్మల్, మంచిర్యాల, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే 'ధరణి'

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'దశాబ్దాల కాలం నుంచి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ రికార్డుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ధరణి' పోర్టల్‌ను అమలులోకి తీసుకొచ్చింది. కానీ కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి దాని పట్ల అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ వివరించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రకాల భూ రికార్డుల సమస్యలకు పరిష్కారం చూపుతున్న ధరణి వ్యవస్థపై విమర్శలు చేయడం తగదని అన్నారు. ధరణి ద్వారా ఇప్పటివరకు 95 శాతం వరకు రెవెన్యూ రికార్డుల సమస్యలు పరిష్కారం అయ్యాయని, మిగతా రికార్డుల సమస్యలు త్వరలోనే కొలిక్కి వస్తాయని తెలిపారు. ఆచరణలో ఎదురవుతున్న పాత రికార్డుల సమస్యలు అక్కడక్కడ కొన్ని అధికారుల దష్టికి వస్తున్నాయని, కుటుంబ కలహాలు, భూముల సరిహద్దు వివాదాలు, పూర్వపు క్రయ విక్రయాల సమస్యలు, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ మాడ్యుల్(టీఎం-33)లో కొన్ని అంశాలు మాత్రమే కలెక్టర్ల వద్ద పరిష్కారం కోసం ఉన్నాయని వివరించారు. వాటిని కూడా దశల వారీగా కొలిక్కి తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. పూర్తిగా పారదర్శకతతో ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న ధరణి సిస్టమ్‌ను తప్పు పట్టడం కిషన్‌రెడ్డికి తగదని, కచ్చితమైన సమస్యను చూపితే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కొన్ని సమస్యలను సాకుగా చూపి మొత్తం ధరణి వ్యవస్థను తప్పు పట్టడం సరికాదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విజయవంతంగా అమలు జరుగుతున్న ధరణి వ్యవస్థను కేంద్ర వ్యవసాయ, ఐటి మంత్రిత్వ శాఖల అధికారులు మెచ్చుకున్నారని తెలిపారు.

జెపిఎస్‌లకు డెడ్‌లైన్ విధించడం అప్రజాస్వామికం

- న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జెపిఎస్) వెంటనే విధుల్లో చేరాలంటూ రాష్ట్ర ప్రభుత్వం డెడ్‌లైన్ విధించడం అప్రజాస్వామికమని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. వారి న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జెపిఎస్‌లు వారి న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం గతనెల 28 నుంచి సమ్మె చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారానికి పూనుకోకపోగా, డెడ్‌లైన్ విధించి శనివారం మధ్యాహ్నం 12 గంటల్లోపు విధుల్లో చేరాలని, లేకుంటే వారిని తొలగించి ఆ స్థానంలో కొత్తవారిని నియమించాలంటూ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలివ్వడం అప్రజాస్వామికమని విమర్శించారు. సమ్మె చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కని పేర్కొన్నారు. దాన్ని కాలరాయడం నిరంకుశత్వమని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జెపిఎస్‌లను చర్చలకు పిలిచి సమస్య పరిష్కారానికి పూనుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది వేలకుపైగా జెపిఎస్‌లు, వెయ్యి మంది వరకు ఒపిఎస్‌లు పనిచేస్తున్నారని తెలిపారు. వారి ప్రొబెషనరీ పీరియడ్ గతనెల 11వ తేదీతో ముగిసిందని పేర్కొన్నారు. ప్రొబేషన్ పూర్తయినప్పటికీ రెగ్యులరైజ్ చేయకపోవడంతో సమ్మెలోకి దిగారని వివరించారు. పారిశుధ్యం, ఉపాధి పనులు, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, వివాహ సర్టిఫికెట్లు, ఇల్లు కట్టుకునేందుకు అనుమతులు వంటి పనులు నిర్వర్తించడంలో జెపిఎస్‌ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. జెపిఎస్‌లను క్రమబద్ధీకరించకుండా సమ్మెలో ఉన్న ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరాలని అల్టిమేటం ఇవ్వడం దురదృష్టకరమని తెలిపారు. జెపిఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వం జిఒను విడుదల చేయాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

కవుల కలాలకు విరామం ఉండదు

- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

ప్రజాశక్తి-కల్చరల్

సామాజిక చైతన్యం గల రచయితల కవుల కలాలకు విరామం ఉండదని శాసన మండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కందుకూరి శ్రీరాములు, సంపత్ కుమార్ సంకలనం చేసిన కవి వారం కవితా సంకలనం సంపుటి అవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ మట్టిలోనే కవిత్వపు వాసనలు ఉన్నాయన్నారు. సారవంతమైన కవితలు కవి వారం సంపుటిలో ఉన్నాయన్నారు. సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిద్ధరెడ్డి సంపుటిని అవిష్కరించి మాట్లాడుతూ ఏభైకి పైగా కవితలు సంపుటిలో ఉన్నాయని, ప్రతి కవితా భావవ్యక్తీకరణతో ఉందని తెలిపారు. కందుకూరి శ్రీరాములు అధ్యక్షత వహించిన సభలోఎస్.రఘు విద్యవతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపికి చోటే లేదు

- మంత్రి ప్రశాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అభివృద్ధిని మరిచి మతాలు, దేవుని పేరుతో రాజకీయాలు చేస్తున్న బిజెపి పట్ల యావత్ దేశ ప్రజలు విసుగు చెందారని చెప్పడానికి కర్ణాటక ఎన్నికల ఫలితాలే నిదర్శనమని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రజల్లో వైషమ్యాలు రెచ్చగొట్టి, దేశ భద్రతనే గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి అసమర్థ, అవినీతి పాలన వల్ల గ్యాస్ సిలిండర్ ధర, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటి సామాన్యులు అరిగోస పడుతున్నారని వివరించారు. కర్ణాటకలో గెలుపు చూసి తెలంగాణలో కూడా గెలుస్తామని రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నారనీ, రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపికి చోటే లేదన్నారు. బిజెపి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు అమలు చేసి చూపాలని మంత్రి వేముల సవాల్ చేశారు.

మోడీ ఓడిపోతే టిఆర్‌ఎస్‌కెందుకు బాధ

- టిపిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక ఫలితాలే తెలంగాణలో పునరావృతం కాబోతున్నాయని, మోడీ ఓడిపోతే టిఆర్ఎస్ వాళ్లు ఎందుకు బాధపడుతున్నారో అర్థం కావడం లేదు అని టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని పేర్కొన్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలు తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా ప్రభావం చూపుతాయని అన్నారు. భారత్ జోడోయాత్రతో కాంగ్రెస్‌లో జోష్ వచ్చిందన్నారు. జోడో యాత్ర తర్వాత కాంగ్రెస్ వరుస విజయాలు సాధిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటక ఫలితాలనంతరం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఎంపి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాయకులు వీ హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, కె జానారెడ్డితో కలిసి రేవంత్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. హిమాచల్‌లో తొలి విజయం, కర్ణాటకలో రెండో విజయం, తెలంగాణలో మూడో విజయం సాధించబోతున్నామన్నారు. చివరగా 2024లో ఎర్రకోట మీద కాంగ్రెస్ జెండా ఎగురవేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. సిఎం కెసిఆర్ ఆలోచనలను కర్ణాటక ప్రజలు విస్పష్టంగా తిరస్కరించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి మతం ఒక విశ్వాసమే కానీ..రాజకీయ అంశం కాదన్నారు. రాముణ్ణి అడ్డుపెట్టుకుని పార్టీ విస్తరించాలనుకోవడం బిజెపి మానుకోవాలని హెచ్చరించారు. కర్ణాటక ఎన్నికల ప్రభావం కచ్చితంగా రాబోయే తెలంగాణ ఎన్నికల మీద ఉంటుందని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు బిఆర్ఎస్‌కు ఇష్టం లేదనీ, అందుకే కర్ణాటక ఫలితాలు తెలంగాణలో పునరావృతం కాబోవని కెటిఆర్ ట్వీట్ చేశారన్నారు.

కర్ణాటక నుంచే మార్పు మొదలైంది

- సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక నుంచే దేశంలో మార్పు మొదలైందని సిఎల్పి నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం రంగారెడ్డి జిల్లా షాబాద్, కొందుర్గు మండలాల్లో కొనసాగింది. షాబాద్ మండల పరిధిలోని మరియాపురం గ్రామ శివారు వద్ద కర్ణాటక ఎన్నికల ఫలితాలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ గెలవడంతో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి పెట్టారు. డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి షాబాద్, కొందుర్గు మండలాల్లో సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ఎంపి సభ్యత్వం రద్దు చేయడమంటే ప్రతిపక్షాన్ని రద్దు చేయడమే అన్నారు. బిజెపికి కర్ణాటక ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. దేశవ్యాప్తంగా బిజెపికి ఎదురుగాలి వీస్తోందన్నారు. కర్ణాటక ఫలితాలే దేశవ్యాప్తంగా పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, పిసిసి మాజీ అధికార ప్రతినిధి పామెన భీమ్ భరత్ పాల్గొన్నారు.

మదీనాగూడాలో కొత్త ఇవి షోరూం

హైదరాబాద్ : విద్యుత్ ద్విచక్రవాహన ఇఎంలలో ఒకటైన ప్యూర్ ఇవి తమ నూతన ఇవి డీలర్‌షిప్ షోరూం యూనివర్శిల్ ఆటోమోటివ్‌ను మదీనాగూడాలో ప్రారంభించినట్లు తెలిపింది. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ప్రారంభించారని పేర్కొంది. ఈ ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ కేంద్రం ప్యూర్ బ్రాండ్ యొక్క విస్తృత శ్రేణీ మోటర్‌సైకిల్స్, స్కూటర్‌లను ప్రదర్శించింది. దేశవ్యాప్తంగానే కాక విదేశాలలో సైతం ఉన్న తమ డీలర్‌షిప్ నెట్‌వర్క్ ద్వారా 60వేలకు పైగా విద్యుత్ ద్విచక్రవాహనాలను ప్యూర్ ఇవి డెలివరీ చేసినట్లు ఆ సంస్థ తెలిపింది.

కూకట్‌పల్లిలో 'మలబార్' రెండవ స్టోర్

హైదరాబాద్ : ప్రముఖ బంగారు, వజ్రాభరణాల రిటైల్ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ హైదరాబాద్‌లో 12 స్టోర్లకు విస్తరించింది. కూకట్‌పల్లిలో శనివారం తన రెండవ స్టోర్‌ను ప్రారంభించింది. ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స ఎండి ఇండియా ఆపరేషన్స్ అషర్ ఓ, రిటైల్ హెడ్ సిరాజ్ పికె లాంఛనంగా ప్రారంభించారు. ఈ నూతన స్టోర్‌ను 10వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసింది. ఈ స్టోర్ నుంచి వచ్చిన లాభాల్లో 5 శాతాన్ని ఆ ప్రాంతంలోని వివిధ స్వచ్ఛంద కార్యకలాపాల కోసం కేటాయించనున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది.

పదో తరగతి ఫలితాల్లో డిపిఎస్ హవా

హైదరాబాద్ : ఎస్ఎస్ఇ బోర్డ్ ఫలితాల్లో తమ 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నాచారం శాఖ వెల్లడించింది. ఈ అంశంలో తమ విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందిస్తున్నామని ఆ పాఠశాల యాజమాన్యం ఓ ప్రకటనలో పేర్కొంది. నాచారం డిపిఎస్ విద్యార్థులైన ప్రణవ్ చౌరాసియా 99.3 శాతం మార్కులతో మొదటి స్థానంలో, సత్యార్థ్ శివకుమార్ అయ్యర్ 98.8 శాతంతో ద్వితీయ స్థానంలో, గోటూరి షణ్ముఖ శ్రీహర్ష 98.7 శాతంతో తృతీయ స్థానంలో నిలిచారని పేర్కొంది. చంద్రిక శ్రీష్ నారాయణ్ (591/600)తో నాలుగో స్థానం, హర్షవర్ధన్ రవిచందర్ (590/600)తో ఐదవ స్థానంలో నిలిచారని తెలిపింది. పల్లవి గ్రూఫ్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ మల్కా కొమరయ్య, డైరెక్టర్ పల్లవి, సిఓఓ మల్కా యశస్వి, సీనియర్ ప్రిన్సిపల్ సునీతరావు, వైస్ ప్రిన్సిపల్ శ్రీమతి సురేఖ నయని సహా ఉపాధ్యాయుల దూరదృష్టి వల్లే ఈ సంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు యాజమాన్యం పేర్కొంది.

ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు

- పారదర్శకంగా పాఠశాల డేటా నిర్వహణ
- ముఖ గుర్తింపుతో విద్యార్థుల హాజరు
- విద్యా సంవత్సరం నుంచే అమలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సర్కారు బడుల బలోపేతానికి ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల సమస్త సమాచారాన్ని సమగ్రశిక్ష పోర్టల్‌లో పొందుపర్చేందుకు ట్యాబ్‌లను వినియోగించనున్నారు. మొబైల్ ఫోన్ల ద్వారా ఈ సమాచారం ఆన్‌లైన్ చేయడం ఇబ్బందికరంగా మారడంతో ట్యాబ్‌లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రస్తుతం విద్యార్థుల హాజరు రిజిస్టర్లలో నమోదు చేస్తుండగా.. ఉపాధ్యాయుల హాజరు బయోమెట్రిక్ విధానంలో నమోదు చేస్తున్నారు. అయితే పాఠశాలల్లో విద్యార్థులు హాజరును కచ్చితంగా తెలుసుకునేందుకు ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత ప్రాథమికోన్నత పాఠశాలల్లో దీనిని అమలు చేయాలని భావిస్తోంది. ఇందుకోసం 10-165 మంది విద్యార్థులున్న బడులకు ఒక ట్యాబ్, విద్యార్థుల సంఖ్య 165 కంటే ఎక్కువ ఉంటే మరో ట్యాబ్‌ను అదనంగా ఇవ్వనున్నారు. త్వరలోనే హెచ్‌ఎంలకు ట్యాబ్‌లను అందజేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది.

ఈ విద్యా సంవత్సరం నుంచే..

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల హాజరులో వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ విధానంతో నిత్యం ఫిజికల్ అటెండెన్స్ రిజిస్ట్రర్‌లో చోటు చేసుకుంటున్నా.. అవకతవకలను నివారించడానికి ఉపాధ్యాయులు పాఠశాల తరగతి గది నుంచే విద్యార్థుల హాజరును ముఖ గుర్తింపులో నమోదు చేయాల్సి ఉంటుంది. పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడానికి ముందే టీచర్ల ఫొటోలను సెల్ఫీ ద్వారా తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేసి వారి ఐడీ నంబర్ పనిచేస్తున్న పాఠశాల, దాని యూడైస్ కోడ్ నెంబర్ తదితర వివరాలన్నింటినీ నమోదు చేయాలి. విద్యార్థుల ప్రవేశాలు, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, పాఠశాలలో మౌలిక వసతులు, ఫొటోలు, ఉపాధ్యాయుల నివేదికలు, విద్యార్థుల ఫొటోలనూ అప్‌లోడ్ చేస్తారు. చైల్డ్‌ఇన్ఫో సమాచారం ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్ చేస్తారు. యూజర్‌ఐడి, లాగిన్ పాస్‌వర్డ్ రీసెట్ చేసే అవకాశం కల్పించనున్నారు. ట్యాబ్‌లు అందుబాటులోకి వస్తే ఉపాధ్యాయులకు సైతం ఇబ్బందులు తొలగనున్నాయి. పాఠశాల, విద్యార్థుల వివరాలను సమగ్రశిక్ష పోర్టల్‌లో సలువుగా పొందపర్చనున్నారు.

జిల్లాలో 1500 బడులకు 1000 ట్యాబ్‌లు...

నల్లగొండ జిల్లాలో 1207 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 293 ప్రాథమికోన్నత పాఠశాలలకు మొదటి విడతగా వెయ్యి ట్యాబ్‌లు అందజేయనున్నారు. జిల్లాకు వచ్చిన ట్యాబ్‌లను విద్యాశాఖ కార్యాలయంలో భద్రపర్చారు.

పాఠశాలల వారీగా త్వరలోనే పంపిణీ

బొల్లారం బిక్షపతి (జిల్లా విద్యాధికారి)

జిల్లాకు వెయ్యి ట్యాబ్‌లు వచ్చాయి. ఇకపై విద్యార్థుల హాజరు పకడ్బందీగా ఉండనుంది. వీటిని త్వరలో హెచ్‌ఎంలకు అందజేస్తాం. దీన్ని అమలుపై ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ ఇస్తాం. ఆ ట్యాబ్‌లో తరగతుల వారీగా విద్యార్థుల ఫొటోలతో పాటు వివరాలను పొందుపరుస్తారు. మధ్యాహ్న భోజన లెక్కలూ పక్కాగా ఉంటాయి. డిజిటల్ బోధనకూ వీటిని ఉపయోగించుకోవచ్చు.

2 నుంచి రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలు

- సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరపాలని సిఎం కెసిఆర్ నిర్ణయించారు. సలహాదారులు, ఉన్నతాధికారులతో శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమావేశమైన ఆయన... వేడుకల నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆధ్వర్యంలో ఉత్సవాల కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతి హృదయం ఉప్పొంగేలా, తెలంగాణ ఘనకీర్తి దశదిశలా చాటే విధంగా వేడుకలు నిర్వహించాలని సిఎం కెసిఆర్ ఈ సందర్భంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి కెసిఆర్ ఆధ్వర్యంలో సచివాలయంలో మొదటి రోజు వేడుకలు ప్రారంభమవుతాయి. అదే రోజు మంత్రులు తమ తమ జిల్లా కేంద్రాల్లో ఉత్సవాలను ప్రారంభిస్తారు. అమరవీరులను స్మరించుకునేందుకు ఒకరోజును ప్రత్యేకంగా మార్టియర్స్ డేగా నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అమరుల స్థూపాలను పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి, గ్రామ గ్రామాన తెలంగాణ అమరవీరులను స్మరిస్తూ నివాళు లర్పిస్తారు. స్వతంత్ర భారత దేశంలో తెలంగాణ కోసం సాగిన తొలిదశ ఉద్యమం మొదలు, రాష్ట్రాన్ని సాధించే వరకూ సాగిన ఉద్యమ చరిత్రను తెలిపేలా డాక్యుమెంటరీని రూపొందించాలని సీఎం ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఒక రాష్ట్రంగా ఏర్పడి ప్రభుత్వ పాలన ప్రారంభమైన 2014 జూన్ 2వ తేదీ నుంచి.. 2023 జూన్ 2 వరకు స్వయం పాలనలో సాగిన సుపరిపాలన, సాధించిన ప్రగతిపై మరో డాక్యుమెంటరీ రూపొందించాలని ఆయన సూచించారు. 21 రోజుల పాటు తెలంగాణ సంబురాలు నిర్వహించాలన్న కెసిఆర్.. పిండి వంటలు, ఆటపాటలు, కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, జానపదాలు, సంగీత విభావరి, సినిమా- జానపద కళాకారులతో ప్రదర్శనలు, సంగీతం, నృత్యం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

31న బ్రాహ్మణ పరిషత్ భవనం ప్రారంభం

హైదరాబాద్ గోపన్‌పల్లిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బ్రాహ్మణ పరిషత్ భవనాన్ని ఈ నెల 31న ప్రారంభించనున్నట్లు సిఎం కెసిఆర్ ప్రకటించారు. బ్రాహ్మణ పరిషత్ భావితరాలకు ఆధ్యాత్మిక కేంద్రంగా కొనసాగుతుందన్నారు. దేశంలోని బ్రాహ్మణ ప్రజాప్రతినిధులను కార్యక్రమానికి పిలవాలని సూచించారు.

భూకబ్జాదారుల ఆగడాలు అరికట్టాలి

- అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసైన్డ్ భూముల్లో కబ్జాదారుల ఆగడాలు అరికట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ శివారు బావురావుపేట్ భూపోరాట కుటుంబాలను శనివారం ఆయన కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బావురావుపేట్ శివారు సర్వే నెంబర్ 8లో అసైన్డ్ భూమిని పేదల ఇళ్ల స్థలాలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 14 రోజులుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. భూపోరాటంలో పాల్గొంటున్న మహిళలను పోలీసులు బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అధికారాన్ని చేపట్టిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు లేని పేదలను పట్టించుకోకపోవడం భావ్యం కాదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిచ్చి ఇస్తామని ఇప్పటి వరకు నెరవేర్చలేదని తెలిపారు. అక్రమార్కుల చేతుల్లో చిక్కుకున్న ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీన పర్చుకోవాలని డిమాండ్ చేశారు. పేదల న్యాయమైన పోరాటానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించాలని కోరారు. అర్హులందరి పేరునా రీఅసైన్డ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రేంకుమార్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొడంకి చందు, కావిరి రవి, పట్టణ కార్యదర్శి ఆవేజ్, ఇండ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు మణి, శ్రీనివాస్, ప్రసన్న, రేణుక, సాజిత్, సంధ్య, లలిత, సమ్మక్క, లత, వైశాలి, భానుమతి, రాధిక, లక్ష్మి, నవీన్, ఉమారాణి, మౌనిక పాల్గొన్నారు.

ఓంకార్ మరణం బాధాకరం

- టిజెఎస్ అధ్యక్షులు కోందండరాం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రగతిశీల ఉద్యమ నేత ప్రొఫెసర్ ఓంకార్ మన మధ్య లేకపోవటం బాధాకరమని టిజెఎస్ అధ్యక్షులు కోదండరాం అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఓంకార్ సంతాప సభను డాక్టర్ అజిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. ఓంకార్ ముక్కుసూటిగా మాట్లాడే వారని గుర్తుచేశారు. స్వతంత్రంగా ఆలోచించడంతోపాటు స్వతంత్రంగా బతకడాన్ని ఇష్టపడేవారని తెలిపారు. తాను చెప్పాల్సిన అభిప్రాయాలను నిక్కచ్చిగా చెప్పేవారని వివరించారు. మంచి మిత్రుడిని కోల్పోయినందుకు బాధగా ఉందన్నారు. 'ఓంకార్ జ్ఞాపకాలు' పుస్తకాన్ని ఐఎఫ్‌టియు జాతీయ నాయకులు బూర్గుల ప్రదీప్ అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓంకార్ ఓ అద్భుతమైన మనిషి కాబట్టే..ఆయన గురించీ, ఆయన జీవితం గురించి, ఆయన కృషి గురించి మాట్లాడుకుంటున్నామని చెప్పారు. ఆయన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి హైదరాబాద్‌కు సుమారు 50ఏండ్ల కిందే వచ్చారని చెప్పారు.ఉస్మానియా యూనివర్సిటీలో పది డిగ్రీ పట్టాలు పొందారన్నారు. అదే విద్యాలయంలో పనిచేసి ప్రొఫెసర్‌గా ఉద్యోగ విరమణ పొందారని గుర్తుచేశారు. ప్రగతి శీల విద్యార్థి ఉద్యమం తామిద్దరి మధ్య స్నేహాన్ని పెంచిందని గుర్తుచేశారు. ఆయన వాల్‌రైటింగ్, బ్యానర్లు, పోస్టర్లు రూపొందించే కృషిలో ప్రతిభావంతుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ప్రహ్లాద్,ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్‌రావు, నాగయ్య, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానిని నైతికంగా ఓడించింది

- కర్ణాటక ఫలితాలపై సీపీఐ నేత నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటకలో బిజెపి ఓటమి ప్రధాని మోడీని నైతికంగా ఓడించిందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ తెలిపారు. కర్ణాటకలో బిజెపి ఓటమి ద్వారా దక్షిణ భారతదేశం ద్వారం ఆ పార్టీకి మూతపడినట్టు అయ్యిందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోడీ సుదీర్ఘకాలం అక్కడే ఉండి కులాలు, మతాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని విమర్శించారు. రాజ్యాంగంలోని లౌకికవాదానికి కట్టుబడి ఉండాల్సిన ప్రధాని ఓట్ల కోసం కక్కుర్తి పడి భజరంగ్‌దళ్ జై అనమన్నారని గుర్తు చేశారు. రాహుల్‌పై కక్షసాధింపు చర్యలు ప్రజల్లో కాంగ్రెస్‌పై సానుభూతి వచ్చిందని తెలిపారు. గ్యాస్, పెట్రోల్ ధరల పెరుగుదల కూడా బిజెపి ఓడించిందని పేర్కొన్నారు. కర్ణాటకలో బిజెపి ఓటమి దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతుందని తెలిపారు.

దేశానికే మార్గదర్శకం : కూనంనేని

కర్ణాటక ఫలితాలు దేశానికే మార్గదర్శకంగా నిలిచాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న కాలంలో దేశంలో బిజెపి వ్యతిరేక ప్రభుత్వాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. సొంతంగా తొమ్మిది రాష్ట్రాల్లోనే బిజెపి అధికారంలో ఉందని తెలిపారు. అత్యున్నత పదవిలో ఉండి మతాల పేరుతో ఓట్లు సంపాదించాలన్న దుర్బుద్ధితో దిగజారి మాట్లాడిన ప్రధాని మోడీకి ఈ ఫలితాలు చెంపపెట్టులాంటివని విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఇదే విధమైన తీర్పును ప్రజలు ఇస్తారని తెలిపారు.

రైతుల మరణాలు పట్టని సర్కార్

- వైఎస్‌షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒకే రోజు ముగ్గురు రైతలు మృతి చెందినా కెసిఆర్ ప్రభుత్వం ఏ మాత్రం స్పందించటం లేదని వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. రైతుల పట్ల కెసిఆర్‌హంతకుడిగా మారారని తెలిపారు. డిగ్రీ చదివి నాలుగేండ్లయినా ఉద్యోగం రాక శివకుమార్ ఉరేసుకుంటే.. 20 రోజులైనా వడ్లకు కాంటాలు వేయకపోవటంతో రైతు ఎల్లయ్య గుండె ఆగి చనిపోయారని పేర్కొన్నారు. 15రోజులుగా సమ్మె చేస్తున్నా.. సర్కారు స్పందించక పోవటంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శి సోనీ తనువు చాలించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒపిఎస్ అమలు చేయకుంటే ఇంటిబాట

- ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక శాసనసభ ఎన్నికల ఫలితాల్లో పాత పెన్షన్ అమలు చేస్తామంటూ ప్రకటించినందున కాంగ్రెస్ పార్టీ గెలిచిందని ఎన్ఎంఒపిఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ, తెలంగాణ సిపిఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ హర్షం ప్రకటించారు. ఆ రాష్ట్రంలోని సిపిఎస్ ఉద్యోగుల ఐదు లక్షల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఓపీఎస్‌ను అమలు చేయడం ద్వారా సామాజిక భద్రత చేకూరుతుందని శనివారం వారు ఒక ప్రకటకలో తెలిపారు. పాత పెన్షన్ అమలు చేస్తామంటూ మ్యానిఫెస్టోలో ప్రకటించిన పార్టీ గెలవడమనేది ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాల్లో ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)పై ఉన్న వ్యతిరేకత మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. నాడు ఓట్ ఫర్ ఓపీఎస్ ద్వారా హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఢిల్లీ, పంజాబ్ ప్రభుత్వాలు పాత పెన్షన్‌ను పునరుద్ధరణ చేశాయని గుర్తు చేశారు. ఆ రాష్ట్రాల జాబితాలో కర్ణాటక రాష్ట్రం కూడా చేరనుందని తెలిపారు. ఓపీఎస్ పునరుద్ధరణ చేయకపోతే ఏ ప్రభుత్వమైనా ఇంటిదారి పట్టాల్సిందేనని వారు పునరుద్ఘాటించారు. డిసెంబర్‌లో బెంగళూరు కేంద్రంగా చేపట్టిన ఓట్ ఫర్ ఓపీఎస్ ఉద్యమం నేడు దాని ప్రతిఫలాలను అందుకోబోతున్నదని వివరించారు. అక్కడ ఐదు లక్షల సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు వారి కుటుంబాల ఓట్లు దాదాపు 35 లక్షల వరకు ఉన్నాయని తెలిపారు. దీంతో రాష్ట్ర ఎన్నికల ముఖచిత్రాన్ని ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి వచ్చే పెన్షన్ నిధితో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందించొచ్చని సూచించారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓట్లు దాదాపు 48 స్థానాలకు పైగా ప్రభావితం చేసిందని తెలిపారు. సిపిఎస్ రద్దుతో కర్ణాటక ప్రభుత్వానికి, ఉద్యోగుల పెన్షన్ కార్పస్ ఫండ్ రూ.24 వేల కోట్లు అందుతాయని వివరించారు. తెలంగాణలో కూడా పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు.

నూతన విద్యావిధానం ప్రమాదకరం

- గణితం, సైన్స్ ప్రశ్నా పత్రంలో కూర్పు లోపాలతోనే తగ్గిన టెన్త్ ఉత్తీర్ణత
- రాష్ట్రంలో 40 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి
- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతపరమైన భావజాలం వ్యాప్తికే కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం-2023 తీసుకొస్తుందని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి అన్నారు. జాతీయ విద్యావిధానంపై 660 పేజీల డ్రాఫ్ట్‌ను రిలీజ్ చేసి అభిప్రాయాలు చెప్పాలని కోరినా అది మాతృభాషలో లేకపోవడం వల్ల చాలా మంది తమ అభిప్రాయాలను వెల్లడించలేకపోయారని తెలిపారు. ఖమ్మం టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన విద్యారంగ సమస్యలపై మాట్లాడారు. దేశం మొత్తానికి ఒకే సిలబస్ ఉండాలన్న పేరుతో భారతదేశ చరిత్ర నుంచి గాంధీజీ హత్య, గుజరాత్ అల్లర్ల వంటి అంశాలను తొలగించి మూఢ, మత విశ్వాసాలను పెంపొందించే సిలబస్‌ను రూపొందిస్తున్నారని తెలిపారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని కూడా తొలగించడం దారుణమన్నారు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీనికోసం జులైలో పాదయాత్రలు, ఆగస్టు 12న నిరసనలు, నవంబర్‌లో మార్చ్ టూ పార్లమెంట్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు చెప్పారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 86.6 శాతం ఉత్తీర్ణత సాధించిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. వందశాతం ఫలితాల కోసం ప్రభుత్వం ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి పెడుతోందన్నారు. సైన్స్, గణితం ప్రశ్నాపత్రాల కూర్పులో లోపాల కారణంగానే రిజల్ట్స్ ఒకింత తగ్గాయన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతోనే ప్రశ్నాపత్రాలు తయారు చేయించాలని కోరారు. రాష్ట్రంలో 20వేల పోస్టుల వరకు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. ఇంగ్లీష్ మీడియంలో మరో 20వేల పోస్టులు అవసరమవుతాయని తెలిపారు. మొత్తం 40 వేల టీచర్ పోస్టులను డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్‌కు దీటుగా గురుకులాల్లో రిజల్ట్ రావడం హర్షనీయమైనా.. అక్కడ ఒక్కో విద్యార్థిపై ఏడాదికి సగటున రూ.1.25 లక్షలు ఖర్చు చేస్తున్నారని.. అదేస్థాయిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ స్కూల్స్‌లోనూ వెచ్చిస్తే మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉందన్నారు.ఎస్‌టిఎఫ్ఐ సమావేశాలు త్రివేంద్రంలో జరిగాయని, దీనిలో విద్యారంగంలో అమలవుతున్న విధానాలపై పలు తీర్మానాలు చేసినట్లు చెప్పారు. నూతన విద్యావిధానంపై సంతకాల సేకరణతోపాటు పలు రకాల ఉద్యమాలు నిర్వహించామని, ఇక మీదట కూడా నిర్వహిస్తామన్నారు. జూనియర్ పంచాయతీ కార్మికులు, మహిళా రెజ్లర్ల నిరసనకు మద్దతు ప్రకటించారు. సకాలంలో వేతనాలు ఇవ్వాలని సంఘం రాష్ట్ర ఆడిటింగ్ బాధ్యులు మహబూబ్‌అలీ కోరారు.

కర్నాటక ఫలితాలతో బిసిల్లో మనోధైర్యం

- దాసు సురేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిల మనోగతాన్ని కర్ణాటక ఎన్నికల ఫలితాలు ప్రతిబింబిపజేశాయని బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాన్యుల ఓట్లతో అధికారంలోకి వచ్చి పేద వర్గాలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. ప్రజల అవసరాలు తీర్చకుండా పెత్తందారీగా వ్యవహరిస్తే ప్రజలు ఎన్నటికైనా కూలదోస్తారని గుర్తుచేశారు. అలాంటి ప్రభుత్వాలకు ప్రజాక్షేత్రంలో పరాభావం తప్పదనే విషయం కర్ణాటక ఎన్నికల ఫలితాల ద్వారా మరోసారి నిరూపితమైందని తెలిపారు. కులగణన నినాదం కాంగ్రెస్‌కు కలిసొచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణలో బిసిలు రాజకీయంగా ఎదగడానికి స్పష్టమైన సంకేతాలు కనపడుతున్నాయని తెలిపారు.

అయ్యో బండీ..ఎక్కడా గెలవలేదండీ..

- కర్ణాటకలో ఫలించని తెలంగాణ నేతల ప్రచారం
- వారు ప్రచారం చేసిన చోట్ల దక్కని గెలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కన్నడనాట తెలుగు ప్రజలు ఎక్కువ ఉండే ప్రాంతాల్లో తెలంగాణ బిజెపి నేతలు చేసిన ప్రచారం బెడిసికొట్టింది. రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ప్రచారం చేసిన చోటల్లా ఆ పార్టీ బొక్కాబోర్లా పడింది. చేరికల కమిటీ కన్వీనర్ ఈటల రాజేందర్ ఈటె గురితప్పింది. ఆయన ప్రచారం చేసి చోట బిజెపి ఓడిపోయింది. వివేక్, మనోహర్‌రెడ్డి, పలువురు నేతలు కూడా కర్ణాటక ప్రచారంలో పాల్గొన్నారు. అక్కడా నిరాశజనకంగానే ఫలితాలు వచ్చాయి. బండి ప్రచారం చేసిన ఒక్కచోట కూడా ఆ పార్టీ అభ్యర్థులు గెలువలేదు. కొన్ని ప్రాంతాల్లోనైతే ఐదో స్థానానికి పడిపోయిన దుస్థితి నెలకొంది. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే ఐదు నియోజకవర్గాల్లో బండి సంజయ్ విస్తృతంగా ప్రచారం చేశారు. ఆ ఐదింటిలోనూ బిజెపి ఒక్కటంటే ఒక్క సీటును కూడా గెలువలేకపోయింది. అక్కడ బిజెపికి మరీ దారుణమైన ఫలితాలు ఎదురయ్యాయి. గౌరీబిదనూర్‌లో బిజెపి అభ్యర్థి హెచ్ఎస్.శశిధర కుమార్‌కు కేవలం 8 వేల ఓట్లే పడ్డాయి. అక్కడ ఆ అభ్యర్థి ఐదో స్థానానికి పరిమితం అయ్యాడు. ముల్బగల్‌లో అక్కడ గెలిచిన జెడిఎస్ అభ్యర్థికి 94,254 ఓట్లు రాగా..బిజెపి అభ్యర్థి సుందర్‌రాజ్ 9 వేల ఓట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. ఆ రెండు చోట్లా బిజెపికి డిపాజిట్ దక్కలేదు. చింతామణిలో కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్‌సీ సుధాకర్‌కు 97,324 ఓట్లు పోలవ్వగా..బిజెపి అభ్యర్థికి 21,711 ఓట్లే వచ్చాయి. బాగేపల్లిలో బిజెపి అభ్యర్థి మునిరాజు 20వేల పైచిలుకు ఓట్లతో పరాజయం పాలయ్యాడు. చిక్‌బల్లాపూర్‌లోనూ బిజెపి అభ్యర్థి 11 వేల ఓట్లతో ఓడిపోయాడు. ఆ నియోజకవర్గాల్లో బండి సంజయ్ వీధివీధి తిరుగుతూ తెలుగులో మాట్లాడి ప్రచారం చేశారు. ఇక్కడిలాగే అక్కడా ప్రజల్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఆయన ఎంత మొరపెట్టుకున్నా కన్నడనాట ఉన్న తెలుగు ఓటర్లు ఆయన్ను ఆదరించలేదు. ఇప్పుడీ వ్యవహారం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నది. కర్ణాటక ఫలితాలపై శనివారం సాయంత్రం వరకూ నేతలెవ్వరూ స్పందించకపోవడంపైనా చర్చనీయాంశం అవుతున్నది. బండి ఎక్కడికెళ్లినా విద్వేషపు ప్రసంగం, రెచ్చగొట్టే కామెంట్స్ చేయడం ఇంకొకటి ఉండదనీ, ఆయా నియోజకవర్గాల్లో వచ్చే ఓట్లు కూడా కాంగ్రెస్‌కే పోయాయని నెటిజన్లు తెగ చర్చించుకుంటున్నారు.

గొర్రెలు ఎప్పుడిస్తారో చెప్పండి?

- సర్కారుకు జిఎంపిఎస్ ప్రశ్న
- ఈ నెల 22న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు
- జూన్‌లో ఛలో హైదరాబాద్

సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గొర్రెలు ఎప్పుడిస్తారో స్పష్టమైన తేదీ చెప్పకుండా ప్రభుత్వం గొల్లకురుమలతో డిడిలు ఎందుకు తీసుకుంటుందని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జిఎంపిఎస్) ప్రశ్నించింది. ప్రభుత్వం గొల్లకురుమల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించింది.ఈ నెల 22న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు చేయాలనీ, జూన్‌లో ఛలో హైదరాబాద్ నిర్వహించాలని నిర్ణయించింది. శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ మాట్లాడుతూ.. గొర్రెలు ఎప్పుడిస్తారో స్పష్టమైన తేదీ ప్రకటించకుండా గొల్లకురుమలతో డిడిలు తీసుకుని, వారిని అప్పులపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యం చేసిన కొద్ది ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిచ్చారు. 10 నెలల క్రితం డిడిలు తీసిన ఖమ్మం, ఆదిలాబాద్, నల్గొండ, వరంగల్ జిల్లాల వారికి ఇప్పటి వరకు గొర్రెలివ్వకుండా నిర్లక్ష్యం చేశారని గుర్తు చేశారు. నెల రోజుల్లో మళ్లీ రాష్ట్ర వ్యాప్తంగా హడావిడిగా వేలాది మందిని డీడీలు తీయించారని తెలిపారు. ఎన్ని నిధులు ఉన్నాయో చెప్పడం లేదనీ, ఏ జిల్లాలో ఏ గ్రామంలో ఎవరికి ముందు పంపిణీ చేస్తారనే కనీస ప్రణాళిక లేకుండా అందరిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. మునుగోడులో చేసినట్లు రాష్ట్ర వ్యాప్తంగా నగదు బదిలీ చేసి గొర్లకాపరులకు నచ్చినచోట ఇష్టమొచ్చిన గొర్రెలు కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అడిగినప్పుడల్లా త్వరలో ప్రారంభిస్తామని చెప్పడం, సకాలంలో పంపిణీ చేయకపోవడంతో గొల్లకుర్మలు విశ్వాసం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే దశలవారీగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులకు, శాసన సభ్యులకు మెమోరాండాలు ఇచ్చామనీ, అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. మరో వారం రోజుల్లో గొర్రెల పంపిణీ ప్రారంభించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు అవిశెట్టి శంకరయ్య, బొల్లం అశోక్, కాల్వ సురేష్, కడెం లింగయ్య, ఎక్కలదేవి కొమురయ్య, బచ్చలకూర శ్రీనివాస్, గౌర శ్రీశైలం, పయ్యావుల మల్లయ్య, కల్కినేని తిరీష్, వేల్పుల రమేష్, చేపూరి ఓదేలు, వజ్జె వినయ్ వివిధ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.